క్లుప్తంగా

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక


నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత తెలిపారు. బెంగళూరుకు చెందిన సుప్రజీత్ ఇంజినీరింగ్ లిమిటెడ్, బిగ్ బిస్కెట్, చెన్నైకు చెందిన మదర్‌సన్ సుమీ వైరింగ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు మురళి, చినరాజప్ప, మదన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 60 మంది హాజరు కాగా 20 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ప్రిన్సిపాల్ సునీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు రామారావు, సురేష్, మదీనా, శివప్రసాద్, లక్ష్మి, వీర భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అభివృద్ధిపై సమీక్షిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

కిర్లంపూడి: చిల్లంగిలో వేలానది ఒడ్డున వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తుల రాఘవాచార్యులు, జగన్నాథాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


కత్తిపూడిలో చిల్డ్రన్ హోమ్‌లో విద్యార్థులతో సీడీపీఓ పద్మావతి

శంఖవరం: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. మండలంలోని కత్తిపూడిలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ హోమ్‌లను శనివారం ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత మైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హోమ్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ శ్రీనువాస్, సుధాకర్ పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత

గోకవరం: స్థానిక గీతా మందిరంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఓ దాత బియ్యం సమర్పించారు. గోకవరం గ్రామానికి చెందిన పట్నాల పద్మావతి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు పట్నాల నాగేంద్ర పది బస్తాల బియ్యాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షులు అక్షింతల రాజా, దోసపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిని కమ్మేసిన పొగ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో శనివారం సాయంత్రం పొగలు అలముకున్నాయి. వర్షం కురిసి తెరిపి ఇవ్వడంతో మేఘాల పొగ అని తొలుత స్థానికులు భావించారు. పొగతో పాటు దుర్వాసన రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపటికి గ్రామశివారు రాజమహేంద్రవరం రోడ్డులో ప్లాస్టిక్ పీపాల నుంచి పొగలు వెదజల్లడం గుర్తించిన స్థానికులు ఫైర్, పోలీసు సిబ్బందికి సమాచారం ఇచ్చారు ఫైర్ సిబ్బంది, అన్నవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పీపాల్లో థియోలిన్ క్లోరైడ్ ఉంచడం, దీనిలో వర్షపునీరు చేరడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించినట్లు గుర్తించారు. ఈ పొగలు ఏమాత్రం ప్రమాదం కాదని విచారణ అధికారులు తెలిపారు. పీపాలపై మట్టిని వేసి పొగలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల గ్రామ శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్థానిక ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.7100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలి



వైద్య రంగంలో పనిచేసే మహిళలకు పూర్తి రక్షణ కల్పించేలా చట్టాలు చేయాలి. ప్రతిరోజూ 24 గంటలు సేవలు అందించేది వైద్య రంగం మాత్రమే. అలాంటి వైద్యులకు రక్షణ లేకపోతే మహిళలు ముందుకు వచ్చేందుకు వెనకడుగు వేస్తారు. సుప్రీంకోర్టు సూచనలను దృష్టిలో ఉంచుకుని మహిళా వైద్యులకు పూర్తి రక్షణ కల్పించాలి. కోల్‌కతా వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– అలమండ తనూజనాయుడు, ఫిజియోథెరపిస్టు, చిరంజీవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఏలేశ్వరం

వైద్యులపై దాడులు హేయమైన చర్య



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటన యావత్ భారత దేశాన్నే కలిచివేసింది. ప్రాణాలు కాపాడే వైద్యుల పట్ల మృగాల్లా వ్యవహరించడం సమంజసమా..? దైవ సమానులైన వైద్యులపై దాడులు చేయడం హేయమైన చర్య. మానవ ప్రాణాలు కాపాడేందుకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తున్నాం. అలాంటి మాపై దాడులు చేయడం సిగ్గు చేటు. కోల్‌కతా హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలి.

– డాక్టర్ బి.సౌమ్య మైఖేల్, సూపరింటెండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు

ఆయిల్ పామ్ సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న మెట్ట రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- నియోజకవర్గంలో 13 వేల ఎకరాల్లో సాగు


మెట్టలో ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న రైతు కూలీలు

జగ్గంపేట: మెట్టప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గ రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు, లాభాలు రావడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సైతం ప్రోత్సాహకాలు అందిస్తోంది. గతంలో పెద్ద రైతులు మాత్రమే ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తే ప్రస్తుతం సన్నకారు, చిన్న రైతులు కూడా ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలతో ఆయిల్ పామ్ సాగుపై మక్కువ చూపిస్తున్నారు.

జగ్గంపేట నియోజకవర్గంలో 1993 నుంచే ఆయిల్ పామ్ సాగు మొదలైంది. జిల్లాలో ఇప్పటికే సుమారు 29 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించింది. ఈ ఏడాది మరో 7500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు విస్తరింపచేయాలని ఉద్యానవన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్‌లో మరింత ఎక్కువగా ఆయిల్ పామ్ విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 13 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. మరో 3 వేల ఎకరాలకు విస్తరింపచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి, పెద్దాపురం, రౌతులపూడి, కోటనందూరుతో పాటు జిల్లాలో 15 మండలాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోంది.

మంచి దిగుబడులు

ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయి. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు ఏడాదికి 8 నుంచి 10 టన్నులకుపైగా దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.13,500 పలుకుతోంది. దీని ఆధారంగా చూస్తే ఎకరాకు పెట్టుబడి ఖర్చులు పోను రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ ఆదాయం వస్తుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి గెలలు కోతకు వస్తాయి. తద్వారా రైతుకు ఏడాదిలో నాలుగు సార్లు దిగుబడులు, వాటి ద్వారా మూడు నెలలకు ఒకసారి ఆదాయం వస్తోంది. రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతోంది.


ఆయిల్ పామ్ సాగు చేసిన పొలం

అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం

ఆయిల్ పామ్ మొక్కలు వేసిన తరువాత నాలుగేళ్లకు కాని ఆదాయం రాదు. ఈ నాలుగేళ్లు రైతులు ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. ప్రభుత్వం అంతర్‌పంటల సాగుకు అనేక రాయితీలు ఇస్తోంది. దీంతో రైతులు ఆయిల్ పామ్ తోటల్లో అంతర్ పంటలుగా మినుములు, పెసలు, కూరగాయలు, రాగులు తదితర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు.

రాయితీలు ఇలా...

ఆయిల్ పామ్ తోటలు వేసే రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ. 28 వేల విలువ చేసే 143 మొక్కలు ఉచితంగా ఇస్తోంది. వీటిని రైతులు నాటుకోవాలి. సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటేందుకు వీలు కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు ఎరువుల ఖర్చుగా ఏడాదికి రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. అంతర్ పంటల సాగుకు ఏడాదికి హెక్టార్‌కు మరో రూ.5250 చొప్పున 4 ఏళ్లు రాయితీగా చెల్లిస్తోంది.


ఆయిల్ పామ్ చెట్టుకు వేసిన గెలలు

తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం



మా సొంత భూమి 15 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు లీజుకు తీసుకుని ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాను. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తోంది. దీని ప్రకారం ఖర్చులు పోను ఎకరాకు రూ.50 వేల వరకూ మిగులుతోంది. తక్కువ మంది కూలీలతో ఏడాది పొడుగునా తోటల్లో అవసరమైన పనులు చేసుకుంటున్నాం. గతంలో వరి, చెరకు, అరటి, కూరగాయలు పండిస్తూ పంట చేతికి వచ్చే వరకూ ఆందోళన చెందేవాళ్లం.

– అడబాల నాగేశ్వరరావు, రైతు, రామవరం, జగ్గంపేట మండలం

ధర బాగుంది



నేను 1993లో మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ వేశాను. అప్పట్లో టన్ను ధర రూ.2 వేలు ఉండేది. దీంతో చాలామంది రైతులు ఆయిల్ పామ్ తోటలు తొలగించారు. మేము మాత్రం అలాగే ఉంచాము. ఇప్పుడు దాని వల్ల మంచి ఆదాయం ఆర్జిస్తున్నాం. మిగిలిన పంటలు వదిలేసి ఇప్పుడు 30 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం టన్ను ధర రూ.13500 పలుకుతోంది. ఖర్చులు పోను మంచి ఆదాయం వస్తోంది.

– పడాల వీర వెంకట సత్యనారాయణ, రైతు, గుర్రంపాలెం, జగ్గంపేట మండలం

డెల్టా ప్రాంతాలకు సాగును విస్తరిస్తున్నాం



ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు అధిక ఆదాయం లభిస్తోంది. మెట్ట ప్రాంత మండలాలలతో పాటు డెల్టా ప్రాంతంలోనూ ఆయిల్ పామ్ సాగు విస్తరింపజేస్తున్నాం. కరప, కాజులూరు, పెదపూడి మండలాల్లో ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు చేపట్టాం. ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. మెట్టలో కొంతమంది రైతుల ఎకరాకు 12 నుంచి 15 టన్నుల దిగుబడి సాధిస్తున్నారు.

– ఎన్.మల్లికార్జునరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి, కాకినాడ

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం


కేజీబీవీ విద్యార్థినులకు ఇస్రో శాస్త్రవేత్తల సేవలను వివరిస్తున్న సైన్స్ టీచర్ మణికుమారి

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శనివారం జాతీయ స్పేస్ డే నిర్వహించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయురాలు లంక మణికుమారి పర్యవేక్షణలో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తయారు చేసిన చంద్రయాన్-3 రాకెట్, వివిధ సాంకేతిక నమూనాలు ప్రదర్శించి, జాతీయ జెండాకు వందనం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అందిస్తున్న శాస్త్ర సాంకేతిక సేవలు, తయారు చేసి ప్రయోగించిన వివిధ రాకెట్ల వివరాలను సైన్సు ఉపాధ్యాయురాలు మణికుమారి విద్యార్థినులకు వివరించారు. భవిష్యత్‌లో విద్యార్థినులు ఇస్రో శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాలలో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన


వెంకటాపురంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

గోకవరం: మండలంలోని వెంకటాపురంలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ), రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతులకు ఎకరానికి 2 కేజీల చొప్పున 40 మందికి రాగులు విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి నాగేశ్వరరావు, ఆత్మ పీడీ జ్యోతిర్మయి, జయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల వైపు వెళ్లవద్దన్నారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే అనేక సమస్యలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో తనిఖీలు


కాండ్రేగులలో విచారణ చేస్తున్న మండల ఏఓ రెడ్ల శ్రీరామ్

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగులలో ఎటువంటి అనుమతులు లేకుండా పురుగు మందులు, ఎరువులు అమ్ముతున్నట్లు ఆరోపణలు రావడంతో వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కిరాణా షాపులో పురుగులు మందుకొన్న ఒక దళిత రైతు వాటిని వినియోగించడం వల్ల పంట నష్టపోయాడని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. దీంతో మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ కాండ్రేగులలోని కిరాణా షాపులో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదని ఏఓ శ్రీరామ్ తెలిపారు.

నిజాలు బయటకు రాకుండా..

కాండ్రేగులలోని కిరాణా షాపులో పురుగులు మందులు కొని వాడి పంట నష్టపోయిన రైతు దళితుడు కావడంతో అతన్ని కొంతమంది భయపెట్టి నిజాలు బయటకు రాకుండా చేశారని ఆర్‌పీఐ సౌత్ ఇండియా కార్యదర్శి, దళిత నేత పులిప్రసాద్ ఆరోపించారు. దీనిపై తగిన రీతిలో వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు బయట పెట్టాలన్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


శ్రీవారి ఆలయంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం పలు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి దేవస్థానం ప్రాంగణంలో చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకూ శ్రావణ మాసం పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు.

రెండు కార్లు ఢీ

త్రుటిలో తప్పిన ప్రమాదం

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు వద్ద శనివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఆ వెనకే వస్తున్న కారును అదుపుచేసేందుకు డ్రైవర్ బ్రేక్ వేయడంతో దాని వెనుక వస్తున్న మరోకారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు వద్ద శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వివరాల ప్రకారం... కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురానికి చెందిన పీరం దైవప్రసాద్‌రావు, విజయ మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తుండగా తాళ్లూరు శివారున గల హనీ దాబా వద్దకు వచ్చేసరికి సమీపంలోని బంక్ గుమస్తా మోటార్ సైకిల్‌పై ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులు దైవ ప్రసాద్‌రావు, విజయలకు రోడ్ సేఫ్టీ అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోక వ్యక్తిని అతని బంధువులు ఆటోలో జగ్గంపేట ఆస్పత్రికి తరలించారు.

హోరు వాన


కాకరాపల్లి శివారులో వెదుళ్లగెడ్డ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. వర్షాలకు చెరువుల్లోకి నీరుచేరి జలకళ సంతరించుకున్నాయి. పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రహదారులు బురదమయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏలేశ్వరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రహదారులపై నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక షిర్డీనగర్‌లోని గాంధీజీ విగ్రహాన్ని ఆనుకుని ఉన్న రహదారిపై ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో పాటు బురదమయంగా మారింది. వర్షాలకు అంటు రోగాలు ప్రబలకుండా అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షానికి పొంగి ప్రవహించిన వెదుళ్లగెడ్డ

కోటనందూరు: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ 41 మిల్లీమీటర్ల వర్షపాతం జిల్లాలోనే అత్యధికంగా నమోదైంది. విస్తారంగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు చెరువులను తలపించాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కాకరాపల్లి శివారు ఉప్పరగూడెం ప్రాంతంలో ఉన్న వెదుళ్లగెడ్డ తుని-నర్సీపట్నం రోడ్డుపై నుంచి పొంగి ప్రవహించింది. మధ్యాహ్నం 3 గంటల వరకూ గెడ్డకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నది ఉధృతి తగ్గిన తరువాత కోటనందూరు, నాతవరం మండలాల పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను పంపించారు. స్థానిక తహసీల్దార్ టి.సుభాష్ గెడ్డ వద్ద పరిస్థితిని పరిశీలించారు.


ఏలేశ్వరంలో బురదమయంగా మారిన రహదారి

తుని రూరల్: మండల వ్యాప్తంగా శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవగా శనివారం ఒక మోస్తరు వర్షం కురవడంతో 28.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తాండవ రిజర్వాయర్ ఎగువన కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లో 377.17 అడుగులకు నీటి మట్టం చేరింది. దీని పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులు. 105 నీటి నిల్వ సామర్థ్యం గల పంపా రిజర్వాయర్‌లో 99.08 అడుగులకు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగునీటి చెరువుల్లో సైతం నీటి నిల్వలు పెరిగాయి. మెట్ట ప్రాంతంలో వందశాతం ఖరీఫ్ వరినాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు: మండలంలోని శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం చినుకులతో మొదలైన వాన మధ్యాహ్నానికి జోరు పెంచింది. పంటలకు వర్షం మేలు చేసినప్పటికీ పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వాన నీరు రోడ్డు బాట పట్టింది. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో వర్షం నీరు పోయే మార్గాలు మూసుకుపోవడంతో ఆ ప్రాంతం చెరువును తలపించింది. అల్లూరి జంక్షన్‌లో ఆక్రమణల కారణంగా చినుకు పడిన ప్రతిసారీ నీట మునుగుతోందని, తక్షణం ఆక్రమణలు తొలగించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు.


చెరువును తలపిస్తున్న ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్

సచివాలయంపై నవరత్నాల లోగో తొలగింపు



తాళ్లూరు గ్రామ సచివాలయం భవనం


లోగో తొలగించిన ప్రాంతం

తుని రూరల్: మండలంలోని తాళ్లూరు గ్రామ సచివాలయంపై ఏర్పాటు చేసిన నవరత్నాల లోగోను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. శుక్రవారం అర్ధ రాత్రి లోగోను తొలగించి ఉంటారని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు తమరాన శ్రీనివాసరావు తెలిపారు. రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గతేడాది అప్పటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో నవరత్నాల లోగోను ఏర్పాటు చేశారు. అదే భవనంలో సచివాలయ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించి ఏర్పాటు చేసిన లోగోను తొలగించడంపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.